## కథ

ఇవాళేమిటో లేచింది లగాయితూ ఒకటే నవ్వు. పక పక పకా. నవ్వు హృదయానందానికి చిహ్నమంటారు. నేనిలా హృదయాన్ని గురించీ, దానికొచ్చిన ఆనందాన్ని గురించీ తల్చుకుంటూ కొండేక్కేశానంటే గెడ్డంతో పాటు గుండూ గీకేసుకుంటాను. బొట్టూ కాటుకా పెట్టేసుకుంటాను.




ఎందుకంటే తరచుగా నే స్పృహ కోల్పోతున్న ఈ తాదాత్మ్యతకి దేభ్యం మొహం, అయోమయం, నల్లజెల్ల అడివీ- అని మా అమ్మ పిలుస్తుంటుంది. బాలకృష్ణుడ్ని పిలుస్తుందా వాళ్ళమ్మ యిన్నేసి పేర్లతో!? పెళ్ళికి ముందూ యిలాంటిదే పరిచయం- కాకపోతే కొంచెం మార్పుతో 'మావాడుత్త అమాయకుడండీ, ఈ కాలంనాటి వాడు కాదు-' వాలిన అరిటాకులాంటి నిలువు పాపిడి తప్ప ముఖం కన్పించనివ్వకుండా కూచున్న మా ఆవిడ చప్పున తలెత్తిందప్పుడే.

ఇంతకూ నవ్వెందుకొచ్చిందన్న విషయం గాక అది ప్రకటించే కారణాల కోసం వెతుకుతున్నానిప్పుడు. ఇదేమైనా గౌతమబుద్ధుడి చిర్నవ్వు కాదయ్యే దాచుకుందుకు. పక్కమీంచే మొదలైన పకపకలు. ఆవిడ విందంటే భూతవైద్యుడ్ని పిల్చుకొస్తుంది. నవ్వును తగ్గించగల సంఘటనలు కొన్ని గుర్తుచేసుకున్నాను. అద్దంలో భూతాల్లా భయపెడుతున్న తెల్ల వెంట్రుకల గురించీ, అటెండెన్స్ రిజిష్టరులో కొత్తగా చేరిన కుర్రాడి పేరు 'భవభూతి' అని రాయడానికి బదులు 'అనుభూతి' అని రాసి హెడ్మాస్టరు ముందు నే పెట్టిన వెర్రి మొహాన్ని, మూగమూగగా గుండెలోనే గుడికట్టి ఆరాధించుకుంటూ

వస్తున్న తోటి టీచర్ భానుమతి వెడ్డింగ్ కార్డివ్వడమే కాకుండా 'తప్పకుండా రండన్నయ్యా' అనడమూ- అబ్బే లాభం లేదు. ఆస్తమా రోగి ఆయాసంలా ఈ నవ్వు తగ్గడమే లేదు. అసలేమీ కారణం లేకుండా పూర్కేనే కితకితలు పెట్టినా వస్తుంది నవ్వు. అయితే నాలాంటి మొగుడున్న మా ఆవిడ లాంటి ఆవిడకి, తెల్లగా తెల్లారిన ఆరు గంటల సమయానికి, అలాంటి సరదాలేం లేవు. అంతవరకూ గ్యారంటీ.

ఇంకిలా కాదనిపించి దుప్పటి మడతపెట్టి దొడ్లోకొచ్చాను. అప్పుడే స్నానం చేసివచ్చిన తొమ్మిదేళ్ళ మా పెద్దమ్మాయి, వీపు కంటిన తడిని తుడుచుకోవడం కోసం తువ్వాలు చెరో కొసా వెనుక పట్టుకుని దాన్తోపాటు తమా వూగుతోంది.

'ఏమిటే ఆ భరతనాట్యం'- అన్నాను కొంత నవ్వు యిక్కడ దించుకుంటూ. అది మాత్రం గొంతు కలపలా. 'రోజూ యింతే కదా నాన్నా నవ్వెందుకు యిందులో' అనేసింది. అంటుంది ఎందుకనదూ!? పిల్ల అంతా వాళ్ళమ్మ పోలిక! తిరుగులేని రామబాణానికి ఖచ్చితమైన వారసులు. నేమ్నాదు గంటసేపు ఉపోద్ఘాతం చెప్పి అసలు విషయం మర్చిపోతుంటాను క్లాసులో.

మేష్టారు మేష్టారు మెట్టాంకాయ మేష్టారు పెళ్ళాం పిరాంకాయ- గోడ వెనుక కుర్ర కుంక.

పిరాంకాయ కాదు పిచ్చి మొహాల్లారా అది పచ్చిమిరపకాయ్-పిల్లలకి భవిష్యద్దర్శనం చెప్పాలనుకున్నాను.

బ్రష్ మీద పేస్టేసుకుని కూనిరాగం తీసుకుంటూ కాసేపు పలువరస మీద సమొలిన్ సాధన చేశాను.

'ఇదిగో కాఫీ, చస్తున్నాను- మనిషి మనిషికీ అందించలేక' అంది నా అర్థాంగి.

'ఇదిగో నచ్చితి నెలరాజా మధువే తెచ్చితి మహరాజా' నా కిష్టమైన పాట ఆర్కెస్ట్రాలో విన్పట్టనిపించింది.

ఇంకో గ్లాసు తెచ్చుకో చెరోసగం తాగుదాం- అన్నానా!, అందామనుకున్నానా?

గోడ మూల బూజు దులిపినట్టు దులిపేసుకుని వెళ్ళిపోయిందేమిటే, ఈ ఆడవాళ్ళెందుకింత చప్పన మారిపోతారూ!

పాపం ఒక్కత్తీ చేసుకోలేక అవస్థపడుతున్నట్టుంది- సర్దుకున్నాను.

తక్షణం ఏదో ఒక సహాయం చెయ్యాలి ఏమిటది!? మసి గిన్నెలు- ఖాళీ బక్కెట్లు- మాసిన బట్టలు.

శ్రీరామనవమి పందిట్లో పానకం కోసం ఒకర్నొకరు తొక్కేసుకుంటూ మీదకొచ్చేస్తున్న భక్తజన బృందాన్ని చూసి ఆస్థాన పూజారి ఇలానే గాభరా పడతాడా!

ఇంత కష్టపడుతోందా నా అర్థాంగి, నాలుగు కామ్పుల నలిబిలి, నా తోడిదే సుఖమై, కష్టమై తానొక తోలుబొమ్మలా మిగిలిన ప్రియసఖి, నా సన్నజాజి.

అగ్గిలేని అగ్గిపుల్లలాంటి నవ్వు, చింత పండులో గింజలు తియ్యలేని నా భావుకతని, ఎన్నిసార్లు కడిగినా వదిలిపోని బాత్రూం మెట్టులాంటి నా పరధ్యానాన్ని- ఎలా భరిస్తోందో పాపం.

—ఈ నా ఆలోచన యావత్తూ ఓ కప్పూ సాసరు కడగనిచ్చిందంతే.

'నాన్నా మలేమో అమ్మ వంత చేస్తోం దత- నిన్నే తావం పొయ్యమంది'- ముద్దు ముద్దుగా అడిగింది ఆఖరి పిల్ల అరవింద.

బంగారు తల్లీ- నా ఝాన్సీరాణీ- నా నైటింగేల్లూ నీక్కాక యింకెవరికమ్మా నేను స్నానం చేయించేది అంటూ దాన్నెత్తుకుని పచ్చిళ్ళతో సహా ఇంటి ముందుకి నడిచాను.

స్నానం కోసం బైటికి రావడమేమిటనే సందేహం మీకు రాకూడదు.

అటకలు అటకలుగా అమర్చినట్టున్న కోళ్ళఫారం లాంటి నా యిల్లు- నాలుగేసి వాటాలకొక పాకీ దొడ్డిగాను, రెండేసి వాటాలకొక స్నానాల దొడ్డిగానూ విలసిల్లుతోంది. ఏడాదికోసారి అద్దె పెంచడానికి తప్ప యింటిగల మారాజు యిటు రాదు. నెల్నెలా మేమే పాదాక్రాంతులమై అద్దె చెల్లించి వస్తుంటాం. వసుదేవుడనే వాడు ఎప్పుడో ఒకప్పుడు గాడిద కాళ్ళు పట్టుకున్నాట్ట! అద్దెకుండు అడ్డగాడిదలమైన మా కాళ్ళు కాదు కదా, తను కట్టిన దుర్భర దుర్గంధ సామూహిక జీవితంలో ఎవరెలా బతుకుతున్నారో చెయ్యి పట్టుకుని కూడా చూడడు. జాతకరీత్యా వాక్కు స్థానంలో రాజుగ్రహం ఉన్న వాడెవడికో సరిహద్దులూ దొడ్లూ హక్కు భుక్తమైపోతుంటాయి.

నన్ను గురించి మా ఇంట్లో వాళ్ళకలాంటి ఆశలేం లేవు. అంచేత ఎవరి తొందర రీత్యా వారు యథారీతిని నన్వారుమంచాలో, చీరలో, గోనెపట్టాలో ఏర్పాటుచేసుకుని పెద్ద వాళ్ళు పెద్దయినందుకు విచారిస్తూ యింటి వెనకా, చిన్నవాళ్ళు చిన్నగా వున్నందుకు ఆనందిస్తూ యింటి ముందు స్నానాలు కానిస్తాం.

ఇప్పుడు మా అమ్మాయిని తీసుకుని నేనింటి ముందుకే వచ్చాను. కబాడీ ఆట తెల్సు కదా మీకు? 'కబాడీ కబాడీ' అనడం మానెయ్యకుండా చటుక్కున ఎదుటివాడి కాలు లాగి కింద పడెయ్యాలి. అలాగే 'నేను ముందు నేను ముందు' అని ఎదుటివాళ్ళకి గుర్తుచేస్తూ బిందెకీ బిందెకి మధ్య చుక్క కింద పడకుండా బక్కెట్టు పెట్టెయ్యాలి. ముందుగా పిల్లకి వంటినిండా సబ్బు పట్టించి, నాలుగు చెంబుల నీళ్ళతో స్నానం అయింది సుమా- అనిపించాను.

కూరలేమైనా తేవాలా- అనడిగాను. విక్రమాదిత్యుడో యింకెవరో తన మంత్రిని యిలా అడుగుతాడేమో ప్రజలెలా వున్నారని!? 'ఈ పూట వంటయింది'- అందావిడ మాటకంటే ముందే వెళ్ళిపోతూ.

సంచీ తగిలించుకుని చెప్పులేసుకుంటున్నాను.

'ఎక్కడి కిప్పుడు ఓ పక్క టైమవ దంలా!?'

'ఫర్లేదులే ఫస్ట్ పీరియడ్ లేదివాళ'- అంటూ గుమ్మం దాటాను.

కూరలు- వంకాయ్, ఆనపకాయ్, ములక్కాయ్, మామిడికాయ్.

పండ్లు- నారింజ, బత్తాయి, ద్రాక్ష, అరటి

తీస్కోండయ్యగారూ- ఇద్దరూ మొహమాట పెట్టసాగారు.

'బీరకాయలెలా?'

'కిలో ఆర్రూపాయలండి'

'ఓహో' చాలా మామూలుగా అందామనుకుని విఫలమయ్యాను.

'బచ్చలికూర తీస్కోండయ్యా కారుచౌక' నన్నప్పుడే తూకం వేసేశాడు వీడు.

లంఖణాలు పడ్డవాడు, అన్నం కెలికినట్టు పావుకిలో చొప్పన రెండు మూడ్రకాలు తీసుకుని రోడ్డు దాటాను.

నేనింటికొచ్చేసరికి అప్పటికే తయారై వడ్డించిన కంచాల ముందు పిల్లలు వరసాగ్గా కూచుని వున్నారు.

నా కోసమేనా?! ముచ్చటేసింది.

పిల్లలూ నేను అందరూ వెళ్ళేదాని పేరు స్కూలే అయినా చిన్న వర్గీకరణ వుంది. నేను వెళ్ళేదాని పేరు మునిసిపల్ స్కూలు. అది భారతదేశం లాంటిది.

ఇంగ్లీష్‌లో మాట్లాడ్డం-నవ్వడం, తిట్టుకోవడం- ఏడవడం- లాంటి వాటివల్ల చాలామంది కున్న మోజులాంటిదే మా ఆవిడకూ వుండడం కారణంగా ఎత్తలేని బరువు నెత్తికెత్తుకున్నాం. అందుగ్గాను మా ఇంట్లో పాలు పాలవాడు కలిపిందానికంటే ఎక్కువ నీళ్ళుంటాయ్. పొద్దున్నా సాయంత్రం ఒకే కూరా పులుసూ వుంటాయ్, ఇంట్లో కుట్టుమిషను మీద పక్కింటివాళ్ళ లంగాలు, జాకెట్లు వుంటాయ్. ఇది మా సర్దుబాటు!

తెలుగువాడు ఇంగిలీషు మాట్లాడినా, ఇంగ్లీష్‌వాడు తెల్గూ మాట్లాడినా యిట్టే తెలిసిపోతుంది. అంచేతే నే వెళ్ళే తెలుగు క్లాసులో 'శుభోదయం' అనిపించుకుని మురిసిపోతుంటాను.

'నువ్వూ వడ్డించేసుకో సరస్వతీ'- అన్నాను. మాటిమాటికీ గుండ గొంతులో కొచ్చేస్తోందేమిటివాళ?

'మీరు కానివ్వండి, నాకింకా పనుంది. రథసప్తమి కదా, సూర్యనారాయణమూర్తికి నైవేద్యం పెట్టాలి, గుళ్ళో కెళ్ళాలి' ఇంక నేనేం వాదించలేదు. మౌనంగా భోజనం ముగించి స్కూలుకేసి నడిచాను.

బోర్డు మీద తేదీ వేసి 'ఆరోగ్యమే మహాభాగ్యం'-అని పాఠం పేరు రాశాను.

పాఠం చెప్పబోయే ప్రతిరోజూ, పిల్లల ఏకాగ్రత స్థిరపరిచేందుకు కొంత ఉపోద్ఘాతం ఇవ్వడం అలవాటు. 'ఆరోగ్యం మహాభాగ్యం ఆరోగ్యంగా లేమనుకోండి, మీ ముందు లడ్డూలు, బాసుంది పెడితే మాత్రం, తినగలా అసలు అరుగుతుందా, లేదు. ఆడుకోలేరు, చదువుకోలేరు. ఏమీ చెయ్యలేరన్న మాట. ఆరోగ్యం ఇంటి చుట్టుపక్కల వాతావరణం మీద కూడా ఆధారపడి వుంటుంది. ఇంటి ముందు పూలమొక్కలుండాలి. ఇంటి వెనుక కూరగాయల పాదులుండాలి. స్నానానికి చక్కటి మరుగుదొడ్లు వుండాలి. ప్రతి ఇంటికీ డ్రైనేజి స్కీము ఏర్పాటుచేసుకోవాలి. మాంసకృత్తులూ, పిండి పదార్థాలు, ఖనిజ లవణాలు ఇంకా అనేక లక్షణాలున్న సంపూర్ణాహారం తీసుకోవాలి. ప్రతిరోజు పొద్దున్నా సాయంత్రం చిక్కటి పాలు తాగాలి. ఆవు తల్లిలాంటిది. ఆవు పాలు వంటికి మంచిది'

-నేనిలా విజృంభిస్తున్నాను.

'మేష్టారూ పాఠం వినకుండా వీడు నిద్ద రోతున్నాడండీ'

'ఏరా నిరక్షర కుక్షీ లేచి మంచో- అలా క్కాదు బెంచీమీద.'

'నాకా పాఠం వచ్చు మాష్టారు రాసేసు కున్నాను కూడా.'

'ఏమిటీ? నే చెప్పకుండానే నీకు పాఠం వచ్చేసిందా, ఏదిలా పట్టా నోట్సు'

వాడది పట్టుకొచ్చాడు. నిజమే ప్రశ్నలూ జవాబులూ క్రమంలో కాకపోయినా అన్నంటూ రాసున్నాయి. పేజీలు తిరగేస్తున్నాను. సూర్యుడు ఒక మహా అగ్నిగోళం, భూమి సూర్యుడి చుట్టూ తిరుగును. చటుక్కున మా ఆవిడ గుర్తొచ్చింది. ఈ పాటికి పాలు పొంగిస్తూ వుంటుందేమో! అందుకోసమే పొద్దున్న చిక్కుడుకాయలు తేవడం గుర్తొచ్చింది. 'అదేమిట్రా సైన్సూ సోషలూ ఒకేదాంట్లో రాసేశావా?'

పట్టుబడిపోయినట్టు ఖంగారుపడ్డాడు వాడు.

'అసలది వాడి నోట్సు కాదండీ వాళ్ళక్కయ్యది' బ్రహ్మ రహస్యం చెప్పేశాడు యింకొకడు. నాకెందుకో నవ్వొచ్చింది. ఉదయం నుంచీ చెలమలు కట్టి ప్రవహించీ ప్రవహించీ సముద్రంలో కలిసినట్టు పకపక పకా.

అడక్కుండానే ఆనందం పంచుకుందుకు పిల్లల్ని మించి యింకెవరుంటారు!

స్కైలాబ్ పడుతుంది పడుతుందని హడలిపోయి వెయ్యి దేవుళ్ళకి మొక్కేసుకుని ఆ ప్రమాదం కాస్తా తప్పిపోయేసరికి రిలీఫ్‌తో కూడిన నవ్వు వాళ్ళలో కూడా.

నా నవ్వు అందుక్కాదు. మా రాత చదివిందే, నాన్న చదివి, అదే నేనే చదివి, నా పిల్లలకి చెప్పి నోట్సులు రాసుకుంటూ, పరీక్షలు పాసవుతూ తప్పుతూ-

ఏదీ పచ్చి అబద్ధాల్ని! మాటికి తొంభై మంది బతుకుతున్న ఎలుక కలుగుల్లాంటి ఇళ్ళని, బతుకులో ముళ్ళని, పాలల్లో నీళ్ళని, రక్తం లేక పాలిపోయిన నా యిల్లాలి కళ్ళని మర్చిపోయి బతుక్కి పనికిరాని ప్రవచనాల్ని పలుకుతూ నేనిందాకా విజృంభించానే, నాకి రాని నా పాఠం వినకుండా నిద్రపోతున్న వాడెంత జ్ఞాని, ఎంత నేర్పరి! పాఠాల్లో మార్పు లేదు, బతుకుల్లో మార్పు లేదు. ఒక బాచ్ మారి మరో బాచ్ వచ్చిన ప్రతిసారి నేనిలా మూతికి రంగూ, కిరీటమూ లేని దుర్యోధనుడిలా రంగప్రవేశం చేస్తూ, లేనిది వున్నట్టూ, వున్నది లేనట్టూ అభినయం చేస్తుంటాను.

ఎవడో పిల్లిలా అరుస్తాడు. పక్కవాడి మీద యింకు చల్లుతాడు. వెనక బెంచీ మీద నిద్రపోతాడు.

ఇక చూడు నా మొహం అచ్చం ద్రౌపది నవ్వు విన్న దుర్యోధనుడున్నట్టే. ఇవాళ నా సంగతి వేరు. సహృదయంతో ద్రౌపదితో గొంతు కలిపి నవ్వుతాను. పకపకపకా.